సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 14 । మార్చి । 2023



ధరపై గంపెడాశలు
వర్జీనియా పొగాకు ధరపై ఈ ఏడాది రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. గత నష్టాలను భర్తీ చేసుకునే ఆలోచనలో ఉన్నారు. 8లో



రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం
రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తోందని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. 8లో



గర్భిణి మృతిపై ఆందోళన
భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రసవానికి వచ్చిన గర్భిణి మృతిచెందగా బంధువులు ఆందోళనకు దిగారు. 8లో

న్యూస్‌రీల్

స్ట్రాంగ్‌రూమ్‌కి బ్యాలెట్ బాక్సులు



స్ట్రాంగ్ రూమ్‌కు సీలు వేస్తున్న రిటర్నింగ్ అధికారి అరుణ్‌బాబు

ఏలూరు(మెట్రో): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌కు సోమవారం రాత్రికి చేరుకున్నాయి. ఏలూరు, జంగారెడ్డిగూడెం, భీమవరం, నరసాపురం, కొవ్వూరు కేంద్రాల నుంచి పోలింగ్ అనంతరం ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ బాక్సులకు సీళ్లు వేసి, వాటిని, ఇతర రికార్డులను తీసుకుని ఇక్కడకు వచ్చారు. ఎన్నికల జిల్లా పరిశీలకులు, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబు స్ట్రాంగ్ రూమ్ వద్ద బ్యాలెట్ బాక్సులను పరిశీలించారు. అనంతరం రిటర్నింగ్ అధికారి అరుణ్‌బాబు స్ట్రాంగ్ రూమ్‌కి సీలు వేశారు. అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వభరత్, డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి, ఆర్డీఓ పెంచెల కిషోర్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, ఏలూరు తహసీల్దార్ సోమశేఖర్ ఉన్నారు.

పటిష్ట బందోబస్తు



భీమవరంలో బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

భీమవరం : జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశామని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. భీమవరం, నరసాపురంలో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని అన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదన్నారు.

ఉత్సాహంగా పోలింగ్

భీమవరం : పశ్చిమగోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. భీమవరంలో పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకుడు ఎస్.సురేష్‌కుమార్‌తో కలిసి ఆమె పరిశీలించారు. జిల్లాలోని రెండు కేంద్రాల్లో ఉదయం నుంచి ఉత్సాహంగా పోలింగ్ జరిగిందన్నారు. భీమవరంలో 201 మందికి 195 మంది, నరసాపురంలో 229 మందికి 227 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు.

ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

సాక్షి, భీమవరం : స్పందన కార్యక్రమంలో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో పోలీసు అధికారులు అలసత్వం వహించవద్దను ఎస్పీ యు.రవిప్రకాష్ ఆదేశించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో పలువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఆయా కేసులకు సంబంధించి పోలీస్‌స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. స్పందనలో 10 ఫిర్యాదులు అందగా వరకట్నం వేధింపులు మూడు, ఆస్తి తగాదాలపై మూడు, చీటింగ్ కేసులు మూడు, ఇతర వేధింపుల కేసులు ఒకటి వచ్చాయన్నారు.

వృత్తి కోర్సుల్లో శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 కార్యక్రమంలో భాగంగా ఏలూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వివిధ కోర్సుల్లో మూడు నెలల ఉచిత శిక్షణ అందిస్తామని సంస్థ ప్రధానాధికారి పి.రజిత ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఆపై విద్యార్హతలు కలిగి 15 నుంచి 45 ఏళ్లలోపు అభ్యర్థులకు జూనియర్ ఫీల్డ్ టెక్నీషియన్ - హోమ్ అప్లయన్సెస్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసోసియేట్ కస్టమర్ కేర్ (వాయిస్ అండ్ నాన్-వాయిస్), ఎలక్ట్రికల్ వెహికల్ అసెంబ్లీ టెక్నీషియన్, సోలార్ లైటింగ్ అసెంబ్లర్ (ఎలక్ట్రిక్ హోమ్ లైటింగ్ సిస్టమ్స్/స్ట్రీట్ లైట్స్) కోర్సుల్లో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులతో ప్రభుత్వ ఐటీఐ, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏలూరు చిరునామాలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పనివేళల్లో ఫోన్ 08812-230269 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



ఏలూరులో ఓటు వేసేందుకు వస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు



భీమవరంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు సురేష్‌కుమార్, కలెక్టర్ ప్రశాంతి

ప్రశాంతంగా పోలింగ్

ఉమ్మడి పశ్చిమలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు

- 98.46 శాతం ఓటింగ్ నమోదు
- ఐదు కేంద్రాల్లో పకడ్బందీగా ప్రక్రియ
- ఓటేసిన శాసనమండలి చైర్మన్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు
- పోలింగ్‌కు దూరంగా ఎంపీ రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్సీలు సాబ్జీ, మంతెన
- 16న కౌంటింగ్

సాక్షి ప్రతినిధి,ఏలూరు : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. చిన్నపాటి ఘర్షణలకు కూడా తావులేకుండా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఏర్పాటుచేసిన ఐదు పోలింగ్ కేంద్రాల్లో ప్రజాప్రతినిధులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. దీంతో పోలింగ్ ముగిసే సమయానికి 98.46 శాతం నమోదైంది. ఈనెల 16న ఏలూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో ఓట్ల లెక్కింపు కార్యక్రమం నిర్వహించి గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందించనున్నారు.

15 నియోజకవర్గాలు.. 1,105 ఓటర్లు

ఉమ్మడి జిల్లాలో ఖాళీ కానున్న రెండు స్థానాలకు సంబంధించి ఎన్నికల ప్రక్రియ చేపట్టారు. జిల్లాలో 15 నియోజకవర్గాల్లో 1,105 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 856 మంది ఎంపీటీసీలు, 48 మంది జెడ్పీటీసీలు, 180 మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎక్స్-అఫీషియో సభ్యులు 21 మంది ఉన్నారు. అధికార వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్‌తో పాటు నలుగురు స్వతంత్రులు బరిలో నిలిచారు.

ఐదు కేంద్రాల్లో..

ఉమ్మడి జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు, భీమవరం, నరసాపురంలోని ఎంపీడీఓ కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆయా డివిజన్లలోని ప్రజాప్రతినిధులు అక్కడ ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. 1,105 ఓట్లకుగాను 1,088 ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా 496 మంది పురుషులు, 592 మంది మహిళా ప్రజాప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబు పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎన్నికల పరిశీలకులు సురేష్‌కుమార్, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కలెక్టర్లు వె.ప్రసన్న వెంకటేష్, పి.ప్రశాంతి, ఎస్పీలు రాహుల్‌దేవ్ శర్మ, యు.రవిప్రకాష్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది.

మధ్యాహ్నం 2 గంటలకే 97.74 శాతం

- ఉదయం 8 గంటలకే పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. మధ్యాహ్నం 2 గంటల సమయానికి జిల్లా వ్యాప్తంగా 97.74 శాతం పోలింగ్ పూర్తయ్యింది. అప్పటికే 1,105 ఓట్లకు 1,080 ఓట్లు పోలయ్యాయి.
- ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలోని పోలింగ్ కేంద్రంలో ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, కొఠారి అబ్బయ్యచౌదరి, పుప్పాల వాసుబాబుతో పాటు కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు ఓటు హక్కు వినియోగించారు.
- జంగారెడ్డిగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, పోలవరం, చింతలపూడి ఎమ్మెల్యేలు తెల్లం బాలరాజు, వీఆర్ ఎలీజాతో పాటు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- కొవ్వూరు ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు ఓటు వేశారు.
- నరసాపురం ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు, స్థానిక ప్రజాప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- భీమవరంలోని పోలింగ్ కేంద్రంలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్సీలు షేక్ సాబ్జీ, మంతెన సత్యనారాయణరాజుతో కలిపి 18 మంది ఓటింగ్‌కి దూరంగా ఉన్నారు.





ఓటు వేసిన మంత్రి కారుమూరి, ఓటు వేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఓటు వేసిన ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు




విజయం మనదే అంటున్న చీఫ్‌విప్ ముదునూరి, ఏలూరులో బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న అధికారులు

ఓటింగ్ ఇలా..

సమయం	పోలైన ఓట్లు	శాతం
ఉదయం 9	68	6.15
ఉదయం 10	241	21.81
ఉదయం 11	534	48.33
మధ్యాహ్నం 12	891	80.63
మధ్యాహ్నం 1	1,060	95.93
మధ్యాహ్నం 2	1,080	97.74
మధ్యాహ్నం 3	1,087	98.37
సాయంత్రం 4	1,088	98.46

కేంద్రం వారీగా..

ఏలూరు కేంద్రంలో 249 ఓట్లు ఉండగా 246, జంగారెడ్డిగూడెం కేంద్రంలో 184 ఓట్లు ఉండగా 180, కొవ్వూరు కేంద్రంలో 242 ఓట్లు ఉండగా 240, నరసాపురం కేంద్రంలో 229 ఓట్లు ఉండగా 227, భీమవరం కేంద్రంలో 201 ఓట్లు ఉండగా 195 పోలయ్యాయి.

ప్రతిపక్షాలకు చెంపపెట్టు

ఎమ్మెల్సీ ఎన్నికల తీర్పు ప్రతిపక్షాలకు చెంపపెట్టు కానుంది. సీఎం జగన్ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై అక్కసుతో సంక్షేమ పథకాలను అడ్డుకోవాలని చూస్తున్నాయి. ఇప్పటికైనా వారు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సహకరించకపోతే ప్రజలు క్షమించరు.

– కొట్టు సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి

బీసీల పక్షపాతి జగన్

బీసీలకు పలు పదవులు కేటాయించిన ఘనత, చట్టసభలకు పెద్ద సంఖ్యలో పంపిన చరిత్ర సీఎం జగన్‌కు మాత్రమే ఉంది. పవన్‌కల్యాణ్ బీసీల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. తెలంగాణలో కూడా జనసేన ఉందని చెబుతున్న ఆయన అక్కడ ఉపకులాలను బీసీ జాబితా నుంచి తొలగిస్తే మాట్లాడే ధైర్యం చేయలేదు.

– మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మంత్రి

వైఎస్సార్ సీపీదే గెలుపు

రాష్ట్రంలో ఎప్పుడు ఏ ఎన్నికలు జరిగినా వైఎస్సార్ సీపీదే విజయం. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా టీడీపీ తీరు మారలేదు. స్థానిక సంస్థల్లో బలం లేకపోయినా స్వతంత్ర అభ్యర్థికి మద్దతు అంటూ ఎన్నికలను అనివార్యం చేసి ప్రజాధనం వృథా చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ మరోసారి టీడీపీ తగిన మూల్యం చెల్లించుకుంటుంది.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్‌విప్

మళ్లీ జగనే సీఎం

రెండోసారి కూడా జగన్ సీఎంగా పీఠాన్ని అధిష్టిస్తారు. ఎమ్మెల్సీ ఎన్నికల సరళి చూస్తుంటే ప్రజాభిమానం అర్థమవుతుంది. 1,105 ఓట్లకు 900కు పైగా వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు ఉన్నారు. ఈ ఎన్నికల్లో 1,000కి పైగా ఓట్లు వైఎస్సార్ సీపీకి వస్తాయి. పోటీలో నిలబెట్టే ధైర్యం లేక చంద్రబాబు స్వతంత్రులతో నామినేషన్లు వేయించడం సిగ్గుచేటు.

–కోటగిరి శ్రీధర్, ఏలూరు ఎంపీ

సంతృప్తికరంగా పోలింగ్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పోలింగ్ సరళి సంతృప్తిగా ఉంది. అన్ని కేంద్రాల్లో ఉత్సాహంగా ప్రజాప్రతినిధులు ఓటు వేసేందుకు వచ్చారు. ఇది కొత్త ఉత్తేజాన్ని ఇస్తోంది. సీఎం జగన్ సంక్షేమ పథకాలు, విధివిధానాలు నచ్చడంతోనే ఈ స్పందన. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు పార్టీ శ్రేణులు ప్రణాళికాబద్ధంగా కృషిచేశారు.

–వంక రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ అభ్యర్థి

చైతన్యం కనిపించింది

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజాప్రతినిధుల చైతన్యం కనిపించింది. అన్ని కేంద్రాలను మరో అభ్యర్థి వంక రవీంద్రనాథ్‌తో కలిసి పరిశీలించాను. దొడ్డిదారిన స్వతంత్ర అభ్యర్థుల పేరుతో పోటీకి నిలిపి టీడీపీ నైతిక విలువలు లేని పార్టీగా మరోసారి నిలిచింది. వారి చర్యను గమనించి ప్రజాప్రతినిధులు ఓటుతోనే బుద్ధిచెప్పేందుకు ముందుకు రావడం సంతోషం.

– కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ అభ్యర్థి










ఓటు వేసిన ఎంపీ కోటగిరి శ్రీధర్, ఓటు వేస్తున్న ఎమ్మెల్యేలు పుప్పాల వాసుబాబు, కొఠారి అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్సీ అభ్యర్థులతో గ్రంధి శ్రీనివాస్, ఓటు వేసేందుకు వేచి ఉన్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, పోలింగ్ కేంద్రానికి వస్తున్న తెల్లం బాలరాజు, నిమ్మల, రామరాజు

ఆక్వా సాగులో నిబంధనలు తప్పనిసరి

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం(ప్రకాశం చౌక్): పర్యావరణానికి హాని కలిగించే ఆక్వా సాగును వ్యవసాయ, ఉద్యాన సాగుతో పోల్చరాదని, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కచ్చితంగా నిలుపుదల చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం మత్స్యశాఖ అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆక్వా సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ఆలోచన చేయరాదని హితవు పలికారు. జిల్లాలో నిబంధనలు అతిక్రమించిన, ఇతర పంటలకు నష్టం చేకూర్చేలా ఉన్న ఆక్వా సాగును కచ్చితంగా నియంత్రించాలని ఆదేశించారు. జిల్లాలో అత్యధికంగా 1.25 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు ఉందని, స్పందన కార్యక్రమం ద్వారా ఇప్పటివరకూ 389 అర్జీలు కేవలం మత్స్యశాఖకు సంబంధించినవి రాగా.. ఆ శాఖ అధికారులు సరైన పరిష్కారం చూపకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

ఫిష్ ఆంధ్రాపై దృష్టి పెట్టాలి

ఫిష్ ఆంధ్రా యూనిట్ల గ్రౌండింగ్ నత్తనడకన సాగుతుందని, ఎన్ని సమీక్షలు పెట్టినా ఒకే సమాధానం రావడం సరికాదని కలెక్టర్ అన్నారు. మెప్మా ద్వారా గుర్తించిన యూనిట్ల లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలు తెరిచి, మిగిలిన ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. ఫిష్ ఆంధ్రా యూనిట్ల ఏర్పాటుకు పట్టణ ప్రాంతంలోని రెస్టారెంట్లు, నూడిల్స్ బండ్లు, బిర్యానీ పాయింట్లు తదితర వర్గాలను ప్రోత్సహించాలన్నారు. బ్రాండింగ్‌కు మెప్మా నుంచి రుణాలు మంజూరు చేయాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీపీఎల్ఎంహెచ్ ఎస్.కుసుమ కుమారి, మెప్మా డీఎంసీ జి.లక్ష్మీపార్వతి, డీఎఫ్ఓ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్‌కు ఆస్కార్ గర్వకారణం




అంబికా కృష్ణ, నిర్మాత, బాలకృష్ణారావు, ఉషా పిక్చర్స్ అధినేత


ఏలూరు (ఆర్ఆర్‌పేట): తెలుగు చలనచిత్ర చరిత్రలో అందని ద్రాక్షగా ఉన్న ఆస్కార్ అవార్డు ఆర్ఆర్ఆర్ చిత్రానికి లభించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఆర్ఆర్ఆర్‌కు ఆస్కార్ వరించడం మాటల్లో వర్ణించలేని అనుభూతి అని సినీ నిర్మాత అంబికా కృష్ణ ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ భారత చలనచిత్రాలు అంటే కేవలం హిందీ సినిమాలే అనుకునే ప్రపంచానికి తెలుగు భాష ఒకటి ఉందని గర్వంగా చాటిచెప్పిన చిత్రంగా ఆర్ఆర్ఆర్ నిలిచిపోయిందన్నారు. ఇది ఆరంభం మాత్రమే అని ఈ స్ఫూర్తితో మరింత మంది దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు ఆస్కార్ దిశగా ముందుకు సాగే అవకాశం ఉందన్నారు. ఆర్ఆర్ఆర్ ప్రపంచం గర్వించే చిత్రమని ఉషా పిక్చర్స్ అధినేత వీవీ బాలకృష్ణారావు అన్నారు. ఈ చిత్రాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో ఉషా పిక్చర్స్ ద్వారా పంపిణీ చేయడం తమకు గర్వకారణంగా నిలుస్తోందన్నారు. దర్శకుడు రాజమౌళి ఏలూరులోని సీఆర్ఆర్ విద్యాసంస్థల్లో విద్యాభ్యాసం చేయడం, చిత్ర నిర్మాత దానయ్య జిల్లాకు చెందిన వ్యక్తి కావడం జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టిందన్నారు. తెలుగు చిత్రాల స్థాయి మరింత పెరిగి, ప్రపంచ దేశాలు ఇటుగా చూస్తున్నాయన్నారు.

మత్స్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉంగుటూరు : బాదంపూడి మత్స్య శిక్షణా కేంద్రంలో మూడు నెలల మత్స్యశిక్షణ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. ఈనెల 25లోపు మత్స్య శాఖ సహాయ సంచాలకులు బాదంపూడి, ఏలూరు జిల్లాకు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటన విడుదల చేశారు. 20 సీట్లు ఉన్నాయని, ఈనెల 27న ఉదయం 11 గంటల నుంచి బాదంపూడి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హుల జాబితా ప్రకటిస్తారని పేర్కొన్నారు. 5వ తరగతి ఆపై చదువుకున్న వారికి ప్రాధాన్యమిస్తారని, 18 నుంచి 30 ఏళ్ల వయసున్న వారు అర్హులని తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు



ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియెట్ థియరీ పరీక్షలు ఈనెల 15 నుంచి పకడ్బందీగా నిర్వహించనున్నట్టు ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు తెలిపారు. సోమవారం స్థానిక కోట దిబ్బలోని ఆర్ఐఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వచ్చేనెల 4 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మొత్తం 106 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామని, ఒక హైపవర్ కమిటీ, 8 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 10 సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. కేంద్రాల్లోని ప్రతి గదిలో సీసీ కెమెరాలను ఏర్పాటుచేశామని, ఆన్‌లైన్ స్ట్రీమింగ్‌లో పర్యవేక్షిస్తామన్నారు. ఫస్టియర్ విద్యార్థులు 33,874 మంది, సెకండియర్ విద్యార్థులు 38,174 మంది హాజరుకానున్నారన్నారు. ఏలూరు జిల్లాలో 39 కేంద్రాల్లో 13,965 మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 52 కేంద్రాల్లో 18,231 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 15 కేంద్రాల్లో 5,978 మంది హాజరు కానున్నారని తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించేలా జిల్లా కేంద్రంలో 08812-230197 నంబర్‌తో, రాష్ట్రస్థాయిలో 18004257635 నంబర్‌తో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశామని చెప్పారు. పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని స్పష్టం చేశారు.

నులిపురుగుల నివారణకు కృషి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

కాళ్ల: నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఉమామహేశ్వరరావు వైద్య సిబ్బందికి సూచించారు. పెదఅమిరం సచివాలయాన్ని సోమవారం ఆయన సందర్శించి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై సూచనలిచ్చారు. అనంతరం గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి మాత్రల పంపిణీ తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా 1 నుంచి 19 ఏళ్ల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తామన్నారు. నూరుశాతం మాత్రల పంపిణీపై శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీల పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రల పంపిణీ పూర్తిచేశామన్నారు. వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు గులాబ్ రాజ్‌కుమార్, రమామహేశ్వరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

గల్ఫ్ నుంచి మృతదేహం రప్పించేందుకు సాయం


గట్టిం మాణిక్యాలరావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తూర్పుగోదావరి జిల్లా కోరుమామిడి గ్రామానికి చెందిన జి.రాంబాబు సౌదీ అరేబియాలో అనారోగ్యంతో మరణించారు. మృతుడి బంధువులు గూడెం వచ్చి క్రైండ్‌నెస్ సొసైటీ అధ్యక్షుడు గట్టిం మాణిక్యాలరావుకు వినతిపత్రం అందజేశారు. గట్టిం స్పందించి విదేశీ కార్యాలయం అధికారులతో మాట్లాడి సౌదీ నుంచి మృతదేహాన్ని ఇండియాకు రప్పించారు. హైదరాబాద్ నుంచి కోరుమామిడికి ఉచిత అంబులెన్స్ ద్వారా మృతదేహాన్ని రప్పించారు. మృతుడి బంధువులు మాణిక్యాలరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ధరపైనే గంపెడాశలు

జంగారెడ్డిగూడెం: వర్జీనియా పొగాకు ధరపై ఈ ఏడాది రైతులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది పంట ఉత్పత్తికి పెట్టుబడులు పెరగడంతో ఆ నష్టాన్ని భర్తీ చేసుకోవాలనే ఆశతో ఉన్నారు. వర్జీనియా పంటకు కుకుంబర్ వైరస్, నల్లకాడు తెగులు వల్ల 25 శాతం మొక్కలు చనిపోవడం, మళ్లీ కొత్తమొక్కలు నాటడంతో సాగు ఖర్చులు విపరీతంగా పెరిగాయి. గత ఏడాదితో పోల్చితే ఒక్కొక్క బార్యన్‌కు రూ.2 లక్షలు అదనంగా ఖర్చయ్యింది. ఎరువుల ధరలు పెరగడం, జిడ్డు మందులు, కూలీ రేట్లు పెరగడంతో రైతులు అదనంగా పెట్టుబడులు పెట్టాల్సి వచ్చింది. ఈ నెల 23 నుంచి పొగాకు వేలం ప్రారంభం కానుంది.

గతేడాది అత్యధికంగా రూ. 245 ధర

గతేడాది ఎన్ఎల్ఎస్ ఏరియా పరిధిలో ఐదు వేలం కేంద్రాల్లో సరాసరి కేజీ ధర రూ.190.74 లభించింది. 42.50 మిలియన్ కిలోల పొగాకును రైతులు అమ్ముకున్నారు. అత్యధికంగా కేజీకి రూ.245 లభించింది. ఇదిలా ఉంటే ఈ ఏడాది ఎన్ఎల్ఎస్ ఏరియా పరిధిలో 11,705 మంది రైతులు, 13575.24 బ్యారన్‌లను రిజిస్టర్ చేసుకోగా, 21720.38 హెక్టార్లలో పంట పండించేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 21005.12 హెక్టార్లలో మాత్రమే పంటలు పండించారు. పొగాకు బోర్డు ఎన్ఎల్ఎస్ పరిధిలో 47.48 మిలియన్ కిలోల పంటకు అనుమతించింది. దేవరపల్లి వేలం కేంద్రం పరిధిలోని బ్లాక్ సాయిల్‌లో పండించే రైతులు 1062 మంది, 1115.50 బ్యారన్లను 1450.18 హెక్టార్లలో పండించేందుకు 2.7 మిలియన్ కిలోల పంటకు అనుమతించారు. లైట్ సాయిల్స్ పరిధిలో 1680 మంది రైతులకు 1943.17 బ్యారన్ల పరిధిలో 3109.07 హెక్టార్లలో 6.8 మిలియన్ కిలోలు, ఈస్టర్న్ లైట్ సాయిల్ పరిధిలో 47 మంది రైతులు 55 బ్యారన్లకు 88 హెక్టార్లలో 1.92 మిలియన్ కిలోలు పంట పండించేందుకు బోర్డు అనుమతించింది.


పొగాకు బేళ్లు

2022-23 సంవత్సరంలో వర్జీనియా పొగాకు సాగు వివరాలు

వేలం కేంద్రం	రైతులు	బ్యారన్‌లు	పండించిన విస్తీర్ణం(హెక్టార్లలో)
దేవరపల్లి	2794	3108.67	3983.88
జంగారెడ్డిగూడెం-1	2407	2924.00	4790.90
జంగారెడ్డిగూడెం-2	2674	2923.67	4365.30
కొయ్యలగూడెం	2598	2958.90	4892.87
గోపాలపురం	2299	2770.50	4248.00
మొత్తం	12772	14690.74	22280.95

రైతులతో ఈడీ సమావేశం

వర్జీనియా పొగాకు రైతు సంఘం నాయకులతో పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు ఇప్పటికే సమావేశం నిర్వహించారు. సమావేశంలో రైతు సంఘాల ప్రతినిధులు ఈ-వేలం ప్రక్రియలో మార్పులు చేయాలని, వ్యాపారులు సిండికేట్ అవ్వకుండా కట్టడి చేయాలని, పొగాకు బేళ్లను కంపెనీలు ఎవరికి వారు పంచుకోకుండా చూడాలని, అన్ని కంపెనీలు వేలం ప్రారంభం నుంచే వేలం పాట పాడుకోవాలని రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. దీనిపై అన్ని చర్యలు తీసుకుంటామని బోర్డు అధికారులు రైతులకు హామీ ఇచ్చారు.

ఈ నెల 23 నుంచి వేలం ప్రారంభం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న ఐదు వేలం కేంద్రాల్లో ఈనెల 23 నుంచి వేలం ప్రారంభం కానుంది. ఎన్ఎల్ఎస్ పరిధిలో గల జంగారెడ్డిగూడెం-1, జంగారెడ్డిగూడెం-2, కొయ్యలగూడెం, గోపాలపురం, దేవరపల్లి, చాగల్లులో వేలం ప్రారంభం కానున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో వేలానికి రైతులు సమావేశం అవుతుండగా, ధరపైనే గంపెడు ఆశతో ఉన్నారు.

కేజీకి రూ. 220 సరాసరి ధర ఇప్పించాలి



అత్యధికంగా కేజీకి రూ. 250 నుంచి రూ. 260 ఇస్తేనే గాని రైతులకు గిట్టుబాటు కాదు. దీనికి కారణం బ్యారన్ పంట పండించేందుకు అయిన ఖర్చు ఈ ఏడాది గతం కన్నా రూ. 2.50 లక్షలుగా ఉంది. పంట దిగుబడి నాణ్యంగా ఉంది. దీనిని బట్టి పొగాకు బోర్డు అధికారులు, బయ్యర్లు రైతును ఆదుకుంటేనే గాని నష్టాల నుంచి రైతు గట్టెక్కలేడు.

– పరిమి రాంబాబు, వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు, జంగారెడ్డిగూడెం 1 వేలం కేంద్రం

ఖర్చులు విపరీతంగా పెరిగాయి



ఈ ఏడాది సాగులో తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొన్నాం. కుకుంబర్ వైరస్ ద్వారా, నల్లకాడ తెగులు వల్ల రైతుకు నష్టం సంభవించింది. దీంతో చాలా వరకు పంట చనిపోయింది. అయినా కష్టనష్టాలను భరించి రైతులు వర్జీనియా సాగు చేశారు. పంట ఖర్చులు విపరీతంగా పెరిగాయి. రైతులకు ప్రారంభ ధర కేజీకి రూ.225తో ప్రారంభించాలి. క్రమేపీ కేజీ ధర అత్యధికంగా రూ. 260 ఇవ్వాలి.

– సత్రం వెంకట్రావు, వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు, జంగారెడ్డిగూడెం 2 వేలం కేంద్రం

అక్రమ మద్యం స్వాధీనం


అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్న దృశ్యం

సాక్షి, భీమవరం: అక్రమంగా మద్యం కలిగిన ఉన్న ఇద్దరిని అరెస్ట్ చేశామని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీవీవీ ఎస్ఎస్ వర్మ తెలిపారు. భీమవరం పట్టణంలో జరిపిన దాడులలో 19 వ వార్డులో కుప్పాల మోహనకృష్ణ ను 42 మద్యం సీసాలతో, కొత్త బస్టాండు వెనుక వైపున గాంధీనగర్ కి చెందిన పులగంగా వెంకయ్య నాయుడుని 19 మద్యం సీసాలతో అరెస్టు చేశామన్నారు. వారిపై భీమవరం ఎస్ఈబీ స్టేషన్‌లో కేసులు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతి చెందిన కోటేశ్వరరావు

భీమడోలు: జాతీయ రహదారి పూళ్ల శివారు కోడూరుపాడు రైల్వే గేటు వద్ద రోడ్డు దాటుతున్న ఓ బైక్‌ను సోమవారం రాత్రి ఓ కారు ఢీకొట్టిన ప్రమాదంలో ధాన్యం కమిషన్ వ్యాపారి మృతిచెందాడు. పూళ్లకు చెందిన నున్నా కోటేశ్వరరావు(53) వ్యవసాయంతో పాటు ధాన్యం కమిషన్ వ్యాపారిగా పని చేస్తున్నాడు. తన బైక్‌పై కోడూరుపాడు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వైపుగా వస్తున్న కారు ఢీకొట్టింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. బాపులపాడు మండలంలోని వేలేరు వద్ద నుంచి బొమ్ములూరు వరకు వయా నూజివీడు మండలం మర్రిబంధం, పల్లెర్లమూడి మీదగా వెళ్లే రహదారిని 15 కిలోమీటర్ల పొడవున విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.23.40 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రస్తుతం ఉన్న 3.80 మీటర్ల రోడ్డును 7 మీటర్లకు వెడల్పు చేసే పనులను మండలంలోని మర్రిబంధం వద్ద సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. నూజివీడు-విజయవాడ రోడ్డును రూ.35 కోట్లతో అభివృద్ధి చేశామని, నూజివీడు-ఏలూరు రోడ్డును రూ.42 కోట్లతో అభివృద్ధి చేసే పనులను త్వరలోనే చేపడతామన్నారు. నూజివీడు పట్టణానికి మైలవరం రోడ్డు నుంచి విస్సన్నపేట రోడ్డుకు దాదాపు ఆరు కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డును నిర్మించేందుకు రూ.25 కోట్లను మంజూరు చేసిందన్నారు. నియోజకవర్గంలోని రోడ్లన్నింటినీ అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో తారురోడ్లను నాసిరకంగా నిర్మించడం వల్లే గతేడాది కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటన్నింటిని ప్రభుత్వం మళ్లీ వేల కోట్లతో పునర్నిర్మించిందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేయకుండా దోచుకోవడమే ధ్యేయంగా పాలన సాగిందన్నారు. సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజలను ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరల గెలిపించుకొని జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ కోపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, మర్రిబంధం, పల్లెర్లమూడి సర్పంచిలు వడ్లాది లక్ష్మి, పులపాక సౌమ్యరేఖ, పల్లెర్లమూడి, ఎంఎస్‌పాలెం ఎంపీటీసీలు చిలుకూరు అనూర్ బాషా, కూచిపూడి లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.


మర్రిబంధం వద్ద రహదారి విస్తరణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

అజీం ప్రేమ్‌జీ వర్సిటీకి శ్రీ షిర్డి సాయి విద్యార్థులు


అజీం ప్రేమ్‌జీ యూనివర్సిటీకి ఎంపికైన శ్రీషిర్డీసాయి విద్యార్థులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): హ్యూమానిటీస్, లిబరల్ ఆర్ట్స్ కోర్సుల్లో ప్రఖ్యాతి గాంచిన అజీం ప్రేమ్‌జీ యూనివర్సిటీలో వివిధ కోర్సులలో ఉన్నత విద్యను అభ్యసించడానికి రాజమండ్రి శ్రీ షిర్డీసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు 17 మంది ఎంపికైనట్లు విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. తమ డాఫ్నీ సివిల్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న కె.రామతేజ, లలిత్ రాజపుట్, ఎస్.ఆశిష్, ఎమ్.ఎస్.ఎస్.సందీప్, కె.త్రిషిత, బీఏ.ఎకనమిక్స్ కోర్సుకు ఎంపికయ్యారన్నారు. ఎస్.కమలి, సీహెచ్ కుసుమ, కేకే నయనసాన్వి, ఎ.భార్గవ్, పి.కృష్ణ విజయ్, ఎ.సహిష్ణ, బీఏ హిస్టరీ కోర్సుకు, జె.శర్వాణి, ఎ.సిద్ధార్థ, బీఏ సోషల్ సైన్స్‌కు, పి.సృజన్ బీఏ ఫిలాసఫీకి, కె.అక్షయ, ఇ.దేదీప్య, బీఎస్సీ ఎన్విరాన్మెంట్ సైన్సెస్‌కు, ఏఎస్.వెంకట రమ్య బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుకు ఎంపికైనట్లు వివరించారు. దీనికి కృషి చేసిన అధ్యాపకులను శ్రీ షిర్డిసాయి విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, సివిల్స్ డీన్ రాజేష్ అభినందించారు.

మహిళ ఆత్మహత్య

చాట్రాయి: తండ్రి కూతురిని కొట్టాడనే మనస్తాపంతో తల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని టి.గుడిపాడులో జరిగింది. పోలీసుల కథనం మేరకు పరసా మోహనరావు ఆదివారం ఉదయం తన కూతురు రత్నశ్రీని కొట్టడంతో తల్లి విజయకుమారి పురుగుల మందు తాగింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందింది.

గర్భిణి మృతిపై ఆందోళన

భీమవరం(ప్రకాశం చౌక్): నర్సాపురం మండలం కొప్పర్రు గ్రామానికి చెందిన పోలిశెట్టి నాగమణి అనే గర్భిణిని ఇటీవల భీమవరం పల్లవి ఆసుపత్రిలో డెలివరీ కోసం చేర్పించారు. డెలివరీ సమయంలో గైనకాలజిస్ట్ లేకుండా వీడియో కాల్ ద్వారా గైనకాలజిస్ట్ సూచనలు సలహాలు ఇస్తూ హెడ్ నర్స్ చేత డెలివరీ చేయించడం వల్ల తీవ్ర రక్తస్రావమై తన భార్య ఆరోగ్యం విషమించిందని నాగమణి భర్త, కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ సోమవారం పల్లవి ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. వారు తెలిపిన వివరాల ప్రకారం నాగమణిని పల్లవి ఆసుపత్రి వైద్యుల సూచనల మేరకు భీమవరం ఇంపీరియల్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మళ్లీ విజయవాడ ప్రైవేటు ఆసుపత్రికి.. అక్కడి నుంచి హైదరాబాద్ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లామని.. అప్పటికే నాగమణి ఆరోగ్యం మరింత క్షీణించిందంటూ వైద్యులు పంపించేశారని తెలిపారు. ఈ సంఘటనపై పోలీసుల వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.


భీమవరం పల్లవి ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

బంగారం, వెండి చోరీ


ఆకివీడు జవ్వాది వారి వీధిలో చోరీ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

ఆకివీడు: ఆకివీడు స్థానిక జవ్వాది వారి వీధిలో నివసిస్తున్న రంభ శివ ఇంట్లో రూ. 5.15 లక్షల విలువైన బంగారు, వెండి, రూ.15 వేల నగదు దోచుకుపోయారు. శివ తండ్రి ఇటీవల మరణించడంతో తన సోదరి ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి రాగా.. తాళం తీసి ఉండటంతో ఆందోళనకు గురై లోపలికి వెళ్ళి చూశారు. బీరువా తాళాలు బద్దలకొట్టి ఉన్నాయని శివ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక బెడ్‌రూంలోని బీరువాలో బంగారు ఆభరణాలు, మరో బెడ్ రూంలోని బీరువాలో అరకిలో వెండి చోరీకి గురైందని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి ఎస్పీ రవి ప్రకాష్ సందర్శించి పరిశీలించారు. ఎస్ఐ కే.రాజారెడ్డి, క్రైమ్ బ్రాంచ్ ఎస్ఐ కృష్ణాజీ, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ వచ్చి పరిశీలించారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: చోరీ ఘటనకు సంబంధించి సోమవారం క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. క్లూస్ టీం ఎస్సై రాధాకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది ఫింగర్ ప్రింట్స్ తదితర ఆధారాలు సేకరించారు. స్థానిక సాలిపేటకు చెందిన కంచర్ల జితేంద్ర తన కుటుంబంతో కలిసి ఈ నెల 11వ తేదీ తెల్లవారుజామున విజయవాడ బంధువుల వివాహానికి వెళ్లి 12వ తేదీ సాయంత్రం ఇంటికి వచ్చారు. ఇంట్లో వస్తువులు చిందర వందరగా పడి ఉండటంతో అనుమానం వచ్చి బెడ్‌రూంలోని బీరువాను పరిశీలించగా, బీరువాలో ఉంచిన 3 కాసుల బంగారం, 6 కేజీల వెండి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వృద్ధుడు

ఇరగవరం: ఇరగవరం మండలం రాపాకలో గుర్తు తెలియని వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఇరగవరం ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాపాక గ్రామంలో శ్మశాన వాటిక వద్ద గత రెండ్రోజులుగా సుమారు 60 ఏళ్ల వయసున్న వ్యక్తి ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 94407 96681 నెంబర్‌కు తెలియజేయాలని ఎస్సై కోరారు.

తెలుగు వారి సత్తా చాటిన నాటు నాటు పాట


రసరాజు

తణుకు: తెలుగు మట్టి గుబాళింపు ఇంతకాలానికి విశ్వవేదికను ప్రభావితం చేసిందని, అందుకు నాటు పాటకు వచ్చిన ఆస్కార్ అవార్డు నిదర్శనమని తణుకు పట్టణానికి చెందిన గేయరచయిత రసరాజు పేర్కొన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆస్కార్ పురస్కారాలకు ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన 81 పాటల్లోంచి 15 పాటలు ఎన్నిక కాగా వాటిలో కేవలం అయిదు పాటలు తుది పరీక్షలో నిలిచాయని, చివరికి నాటు నాటు పాట ఎంపికవడం ప్రశంసనీయమన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

తణుకు: ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తణుకు ఎస్ఈబీ సీఐ ఆర్.సత్యవతి తెలిపారు. పెనుగొండలో పిల్లి శంకర ప్రసాద్ అనే వ్యక్తి మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేసిన 24 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

మహిళలు మరింత అభివృద్ధి చెందాలి



కేక్ కట్ చేస్తున్న మహిళా జడ్జిలు, మహిళా న్యాయవాదులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం బార్ అసోసియేషన్ మహిళా న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ జరిగింది. మహిళా జడ్జిలను సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహిళలు మరింతగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు, జూనియర్ సివిల్ జడ్జి ఎ.నాగ మల్లేశ్వరీ, సెకండ క్లాస్ మేజిస్ట్రేట్ రమ్య, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.అరుంధతి, సీనియర్ న్యాయవాది దుర్గాదేవి, సత్యవేణి, గీతా రెడ్డి, ధనలక్ష్మి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసర వస్తువుల పంపిణీ



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న మహిళా వాకర్స్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం కడకట్లలోని లెప్రసీ కాలనీలో రోగులకు బియ్యం, కూరగాయలు, నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, చీరలు అందజేశారు. విజయలక్ష్మి మాట్లాడుతూ స్వచ్ఛంధ సేవా సంస్థలు ఆధ్వర్యంలో పేదలను, రోగులను ఆదుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనక దుర్గ, ఇందిరా కుమారి, రామలక్ష్మి, ఉదయ కుమారి, అరుణకుమారి, లక్ష్మి, దూలం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్పటిక లింగానికి అభిషేకాలు



శంకరమఠంలో స్పటిక లింగం దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో పలు శివాలయాల లో సోమవారం సందర్భంగా స్వామివార్లకు విశేష పూజలు జరిగాయి. పెద్ద శివాలయంలో భారీ అన్నసమారాధన జరిగింది. శంకరమఠంలో స్పటికలింగానికి పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పూజలు నిర్వహించారు.


5న చలో దిల్లీ



కావలిపురంలో ఉపాధి కూలీలతో ప్రచారం చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఇరగవరం: కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి బల్ల చిన్న వీరభద్రం తెలిపారు. సోమవారం కావలిపురం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు రద్దు చేసి, పెరిగిన నిత్యావసర వస్తువులకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండిచే పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భావన సంజీవ రావు, వీరవల్లి సీతా మహలక్ష్మీ, కుక్కల సుధా రాణి, కనిపే నాగ కుమారి, వాసంశెట్టి గంగ రాజు, కేతా శ్రీను, ఓలేటి చంద్ర, కనిపే బాబురావు పాల్గొన్నారు.

తణుకులో ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్ల దినోత్సవం



తణుకులో వేడుకలు నిర్వహించిన ల్యాబ్ టెక్నీషియన్లు

తణుకు: ల్యాబ్ టెక్నీషియన్ల దినోత్సవాన్ని సోమవారం తణుకులో ఘనంగా నిర్వహించారు. తణుకు పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో లేబొరేటరీల్లో పని చేసే టెక్నీషియన్లు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. స్థానిక హెల్త్‌కేర్ లేబొరేటరీ వద్ద నిర్వహించిన ఈ క్యాక్రమంలో విధి నిర్వహణలో టెక్నీషియన్లు ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు సూచించారు. ఈ కార్యక్రమంలో రవి, చిరంజీవి, కిషోర్, రాజు, దిలీప్, లక్ష్మణ్, అనిల్, రాజేష్, ఆనంద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

- కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు
- ఉదయం నుంచి సాయంత్రం వరకూ కొనసాగిన పోలింగ్



నరసాపురంలో పోలింగ్ కేంద్రం వద్ద స్థానిక సంస్థల ప్రతినిధులు



నరసాపురం పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

సాక్షి, భీమవరం: భీమవరంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో 97.5 శాతం మంది ప్రజా ప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పర్యవేక్షణ, ఎస్పీ యు.రవిప్రకాష్ సారథ్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ఘట్టం పూర్తయింది. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభంకాగా మొట్టమొదటి ఓటును వీరవాసరం ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని వినియోగించుకోగా, 9గంటలకు కేవలం రెండు ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఉదయం 11 గంటలకు 101 ఓట్లు, 11.15 గంటలకు 156 ఓట్లు పోల్‌కాగా మధ్యాహ్నం 12గంటలకు 184 ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ గడువు ముగిసేసరికి మొత్తం 201 ఓట్లకుగాను 195 మంది ప్రజాప్రతినిధులు ఓట్లు వేశారు. భీమవరం పోలింగ్ కేంద్రంలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, భీమవరం, ఉండి ఎమ్మెల్యేలు గ్రంధి శ్రీనివాస్, మంతెన రామరాజు, జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి కవురు శ్రీనివాస్, భీమవరం ఎంపీపీ, జెడ్పీటీసీలు పేరిచర్ల విజయనర్సింహరాజు, కాండ్రుగుల నర్సింహరావు తదితరులు ఓట్లు వేశారు. భీమవరం, వీరవాసరం, పెంటపాడు, తాడేపల్లిగూడెం, ఆకివీడు నగర పంచాయతీల్లో నూరుశాతం ఓట్లు పోలవడం విశేషం. ఓటు వేసిన 195 మందిలో 101 మంది మహిళలు, 94 మంది పురుషులున్నారు.

ఓటు వేసిన ప్రముఖులు

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, తణుకు ఎమ్మెల్యే కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ అభ్యర్థి, జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ కలసి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మధ్యాహ్నం 1 గంట దాటిన తరువాత వచ్చి ఓటు వేశారు. మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, టీడీపీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు ఓటు హక్కు వినియోగించుకున్నారు. నరసాపురం డీఎస్పీ రవి మనోహరాచారి, సీఐలు శ్రీనివాసయాదవ్, సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నరసాపురం: నరసాపురంలో సోమవారం నిర్వహించిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. డివిజన్ పరిధిలోని నరసాపురం, పాలకొల్లు, మొగల్తూరు, యలమంచిలి, పెనుగొండ, పెనుమంట్ర, తణుకు, ఇరగవరం, పోడూరు, ఆచంట మండలాలకు సంబంధించిన ప్రజాప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో ఎంపీటీసీలు 182 మంది, జెడ్పీటీసీ సభ్యులు 10 మంది, నరసాపురం మున్సిపాలిటీకి చెందిన 31 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఐదుగురు ఉన్నారు. మొత్తంగా డివిజన్‌లో 229 ఓట్లు ఉండగా, వాటిలో 227 ఓట్లు పోలయ్యాయి. ఎంపీ రఘురామకృష్ణంరాజు, మరో స్థానిక సంస్థ ప్రతినిధి మినహా మిగిలిన వారందరూ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



మృతుడి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా అందిస్తున్న నాయకులు

ఇరగవరం: కె.ఇల్లిందలపర్రు గ్రామానికి చెందిన వరద గణపతి (48) వారం రోజుల క్రితం గుండె పోటుతో మరణించారు. అతని కుటుంబానికి వైఎస్సార్ బీమా రూ.లక్ష మంజూర్యయిందని కె.ఇల్లిందలపర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున తెలిపారు. ఈ మేరకు సోమవారం మృతుడి మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. గతంలో పేద బడుగు బలహీన వర్గాల వ్యక్తులు మృతి చెందిన సమయంలో కనీసం కుటుంబంలో మట్టి ఖర్చులు కూడా అందించలేని స్థితిలో ఉండేవారని ప్రస్తుతం కుటుంబంలో పెద్ద మృతి చెందిన వెంటనే వైఎస్సార్ బీమా ద్వారా సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గరికిపాటి సతీష్, గోగి బాబి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్3ఎన్2 వైరస్ పట్ల జాగ్రత్తలు తీసుకుందాం



అవగాహన కల్పిస్తున్న సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రస్తుత హెచ్3ఎన్2 వైరస్ వ్యాపి జరుగుతున్న నేపథ్యంలో ఆందోళన చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకుందామని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వార్డుల్లో జరుగుతున్న ఫీవర్ సర్వే, కీటక జనిత వ్యాధుల నియంత్రణ, పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరిచే కార్యక్రమాలపై సోమవారం పట్టణంలో సబ్ యూనిట్ అధికారి ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. వైరస్ వల్ల జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు వైద్య ఆరోగ్య శాఖ చెప్పే సూచనలు పాటిస్తే నియంత్రణ సాధ్యమన్నారు. వైరస్ కారణంగా గొంతునొప్పి, జ్వరం మూడు నుంచి ఐదు రోజులు, దగ్గు మూడు వారాలు వరకు, కొద్ది మందిలో ఆయాసం, చలి, వాంతులు, ముక్కు కారడం, తుమ్ములు ఉంటాయని తెలిపారు. ప్రజలందరూ చేతులు తరుచుగా శుభ్రం చేసుకోవాలని, మాస్కులు ధరించాలని, తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు చేయి అడ్డం పెట్టుకోవాలని, ఎక్కువ నీరు తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు, ఆశాలు, వలంటీర్లు, ఆరోగ్య సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగు నివారణ మాత్రల పంపిణీ



ఐసీడీఎస్, విద్యాశాఖ సిబ్బందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసిన ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో, ఎంఈవో

తాడేపల్లిగూడెం రూరల్: బాలబాలికల్లో రక్తహీనత నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వేణుగోపాలరావు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్యారోగ్య శాఖసిబ్బందికి నులిపురుగుల నివారణ మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వేణుగోపాలరావు మాట్లాడుతూ 19 ఏళ్ల లోపు బాలబాలికలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలన్నారు. తద్వారా రక్తహీనత నివారణతో పాటు బాలబాలికలు ఆరోగ్యకరంగా ఎదుగుతారన్నారు. నూరు శాతం ఈ కార్యక్రమం విజయవంతానికి విద్యా శాఖ, ఐసీడీఎస్ అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వి.హనుమ, పీహెచ్‌సీ వైద్యులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుగొలనులో గోదాము నిర్మాణం



మహాజన సభలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ చిక్కాల సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ఆరుగొలను గ్రామంలో సొసైటీ గోదామును రూ.40లక్షలతో నిర్మిస్తున్నామని సొసైటీ అధ్యక్షుడు చిక్కాల సత్యనారాయణ తెలిపారు. సోమవారం మండలంలోని ఆరుగొలను సొసైటీ ఆవరణలో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ సొసైటీ ఆదాయం రూ.16లక్షలు పైబడి ఉందన్నారు. సభ్యుల సూచన మేరకు సొసైటీకి వచ్చిన హామీలీ ఛార్జీలను సొసైటీ ఆదాయంలోనే ఉంచామన్నారు. సొసైటీ పరిధిలోని దండగర్ర, కొత్తూరు, ఆరుగొలను గ్రామాలకు సరిహద్దులు నిర్మిస్తామన్నారు. సొసైటీలోని లాకరు సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. తొలుత సొసైటీ కార్యదర్శి గోపిరెడ్డి సత్యశ్రీనివాస్ సమావేశ అజెండాను చదివి వినిపించారు. అనంతరం సొసైటీలో పనిచేసే సిబ్బందిని రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశంలో తీర్మానించారు. బాదం సూర్యచంద్రరావు, యాతం సత్యనారాయణ, ఎమ్పీటీసీ శంకరరావు, సొసైటీ మాజీ చైర్మన్ కృష్ణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

సాక్షి, భీమవరం: చండీఘర్‌లోని పంజాబ్ యూనివర్సిటీ క్రీడా ప్రాంగణంలో ఈనెల 17 నుంచి 21 వరకు జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ మహిళల సాఫ్ట్ బాల్ పోటీలకు ఆదికవి నన్నయ యూనివర్సిటీ జట్టుకు సీఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ సకుమళ్ల సత్యనారాయణ చెప్పారు. మహిళల విభాగంలో బీకాం ప్రథమ సంవత్సరం విద్యార్థినులు టి.జ్యోతి శ్రీనాగ దుర్గా భవాని, లంకా శిరీషలు ఇటీవల నన్నయ్య వర్సిటీ క్రీడా ప్రాంగణంలో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచారన్నారు. విద్యార్థినులను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ, అధ్యక్షుడు ముత్యాల వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ వడుపు గోపి, ప్రిన్సిపల్ సకుమళ్ల సత్యనారాయణ అభినందించారు.

మొల్లమాంబను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి



అత్తిలిలో మొల్లమాంబ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కుమ్మర శాలివాహన సంఘు నాయకులు

అత్తిలి: వాల్మీకి రామాయణాన్ని అన్యభాషల్లో అందరికీ అర్థమయ్యేరీతిలో రచించి, ప్రజలకు అంకితం ఇచ్చిన ఏకైక కవయిత్రి మొల్లమాంబ అని కుమ్మరి శాలవాహన సంఘు నాయకులు ఇరగవరపు నరశింహారావు అన్నారు. కవయిత్రి మొల్లమాంబ 583వ జయంతి వేడుకను అత్తిలిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కెనాల్‌రోడ్డులోగల మొల్లమాంబ విగ్రహానికి పలువురు కుమ్మర శాలివాహనులు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈసందర్భంగా నరశింహారావు మాట్లాడుతూ వెనుకబడిన కులంలో పుట్టి, దీక్షతోవిద్యను అభ్యసించి కవయిత్రిగా మంచి పేరుప్రఖ్యాతులు సంపాదించిన మొల్లమాంబను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కుమ్మర శాలివాహన సంఘు నాయకులు ఇరగవరపు రామకృష్ణ, భీమవరపు సాంబయ్య, గుత్తిందీవి శ్రీనివాస్, ఇరగవరపు కోటేశ్వరరావు, రేలంగి శరబలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు

తణుకు టౌన్: రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన మొదటి కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ 583వ జయంతి వేడుకలను తణుకు పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తణుకు హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద గల వైఎస్సార్ పార్కులో గల మొల్ల విగ్రహానికి తణుకు పట్టణ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించాచు. ఈసందర్భంగా రాష్ట్ర కుమ్మర శాలివాహన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి బిరుదుకోట చింతన్న మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో మొల్ల రచనలు గురించి వివరించారు. మొల్ల శ్రీ కృష్ణదేవరాయల కాలంలోని కవయిత్రి అని, తెనాలి రామకృష్ణుడు ఈమెకు సమకాలికుడు అని వివరించారు. వాల్మీకి రామాయణాన్ని ఆరు ఖండములుగా, 138 పద్యాలుగా ఐదు రోజుల్లో పండిత, పామరులకు అర్ధమయ్యే రీతిలో రాసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా, విజ్ఞాన సంక్షేమ సంఘం అధ్యక్షుడు చుంచుల వెంకటేశ్వరరావు, వెల్లా నరశింహమూర్తి, వెంకటేశ్వరరావు, ఉదయ భాస్కర్, లాంగు శ్రీనివాస్, గోడి సత్యనారాయణ, నరశింహమూర్తి, శివాజీ, కోనాల మల్లికార్జునరావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పగలు ఉడుకు.. రాత్రి వణుకు



ఎండ తీవ్రతకు వెలవెలబోతున్న పైడిపర్రు సెంటర్

- భిన్న వాతావరణ పరిస్థితులు
- పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- మధ్యాహ్నానికే రోడ్లన్నీ నిర్మానుష్యం

తణుకు: పగలు ఎండ వేడిమి... రాత్రి సమయాల్లో చలితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత కొద్ది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండగా... రాత్రి చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. కొద్దిరోజులుగా తెల్లవారుజామున దట్టమైన మంచు కురుస్తోంది. సాధారణంగా శివరాత్రి వస్తే శివ శివా అంటూ చలిగాలులు వెళ్లిపోతాయని చెబుతుంటారు. అయితే గతంలో ఎప్పుడూ లేని విధంగా మార్చి మొదటి వారం నుంచే ఎండ తీవ్రత అధికమవుతోంది. మరోవైపు గత కొద్ది రోజులుగా రాత్రి సమయాల్లో చలిగాలులు పెరుగుతున్నాయి.

ఎండవేడిమి

గత వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. తణుకు పరిసర ప్రాంతాల్లో గరిష్టంగా 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. అయితే రాత్రి సమయాల్లో మాత్రం ఉష్ణోగ్రతలు అమాంతం పడిపోతున్నాయి. సోమవారం తెల్లవారుజామున 20 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా మధ్యాహ్నం 35 డిగ్రీల పైబడి నమోదవుతోంది. రాత్రి సమయాల్లో చలిగాలుల తీవ్రత అధికమవుతోంది. తెల్లవారుజామున పొగమంచు కమ్ముకుంటోంది. వాతావరణంలో భిన్న మార్పులు కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

వారం రోజులుగా పగలు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. రెండు నెలలుగా శీతాకాలం కావడంతో ఏసీలు, ఫ్యాన్‌ల వినియోగం తగ్గింది. అయితే గణనీయంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండంతో ఏసీలు, ఫ్యాన్‌ల వాడకం పెరుగుతోంది. దీంతో విద్యుత్ వాడకం పెరుగుతోందని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఈ పరిస్థితుల్లో ఆరోగ్యంపై శ్రద్ధ ఉంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రకటన

[illegible] S/o. [illegible] R/o. [illegible] O.S.44/1976 [illegible] 29.07.1988 [illegible] ABCD [illegible] "D" [illegible] ABC [illegible] S/o. [illegible] GVR [illegible] 15.01.2005 [illegible] GPA కమ్ Sale [illegible] DIG [illegible]

షెడ్యూలు ఆస్థివివరం : [illegible] OS.44/1976 [illegible] "D" [illegible] Ac.3-98 [illegible]

తాడేపల్లిగూడెం 14.3.2023 [illegible]

లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయం



వివిధ రంగాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ సిబ్బందిని సత్కరించిన లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సభ్యులు



డైమండ్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవలను అందజేస్తున్న సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్‌లో భాగంగా జిల్లా గవర్నర్ విజిట్ సోమవారం నియోజకవర్గంలో జరిగింది. పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం కార్యాలయంలో అధ్యక్షుడు సన్నిధి సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా గవర్నర్ డాక్టర్ వీకే పంకజాక్షన్ హాజరైయారు. సేవా మహోత్సవం జరిగింది. మూడు కుట్టు మిషన్లు, గ్రైండర్లు, సైకిల్స్ మహిళలకు అందజేశారు. ప్రతి సంవత్సరం ఆయా రంగాల్లో పనిచేసే నిష్ణాతులైన ప్రభుత్వ రంగంలోని వారిని గుర్తించి ఇచ్చే అవార్డుల్లో భాగంగా ఉత్తమ సేవా అవార్డులు అందజేశారు. పోస్టుమన్ లింగంపల్లి లీల కృష్ణ శంకర ప్రసాద్, పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి హెడ్ కానిస్టేబుల్ గుమ్మడి శ్రీను, అగ్నిమాపక సిబ్బంది కర్నాటి శ్రీనివాసరావు, ఆర్టీసీ కండెక్టర్ ఎస్.ధనలక్ష్మి, ఎలక్ట్రికల్ లైన్ ఇనస్పెక్టర్ గుర్రాల రామాంజనేయ వరప్రసాద్‌లను గుర్తించి క్లబ్ జ్ఞాపికను అందించి, దుశ్శాలువాతో సత్కారం చేశారు. శ్రీ వాసవి ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో వి.వెంకట స్వామి, ఆర్‌వీఎస్ సూర్యనారాయణరాజు, వట్టిపోలు రాము, జగదీష్, గ్రంధి సత్యనారాయణ, బాపయ్యశర్మ, మదన్‌మోహన్ అగర్వాల్, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు మరింత విస్తరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ) : అంతర్జాతీయ లయన్స్‌క్లబ్ సేవలు మారుమూల గ్రామాల్లో విస్తరించాలని రీజియన్ చైర్‌పర్సన్ ఆర్‌వీఎస్ సూర్యనారాయణ రాజు కోరారు. పట్టణంలోని పేరిచర్ల ఫౌండేషన్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో ఆర్‌సీ గుడ్ విల్ విజిట్ జరిగింది. క్లబ్ సేవలను సోమవారం పరిశీలించారు. సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ 175 దేశాల్లో ప్రతి రెండు నిమిషాలకి ఒక సేవ జరుగుతుందని అటువంటి సంస్థలో సభ్యులుగా ఉండటం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం సూర్యనారాయణ రాజును సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు, గ్రైండర్లు, బాలికలకు సైకిల్స్, బియ్యం, కూరగాయలు అందజేశారు.ఈ కార్యక్రమంలో డైమండ్స్ అధ్యక్షుడు కోనా హనుమాన్, అడ్మినిస్ట్రేటర్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు, జెడ్పీ వట్టిప్రోలు రాము, జిల్లా క్యాబినెట్ సెక్రటరీ నూకల నాగ మల్లేశ్వరరావు, మునగాల జితేంద్ర కుమార్, డైమండ్స్ సభ్యులు పాల్గొన్నారు.